క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



రాజోళి: దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పీహెచ్‌సీ సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా మండలకేంద్రంలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని యజమానులకు సూచించారు. కూలర్లు, డ్రమ్ములు, తొట్టెలలో ఉన్న నీటిని పారపోశారు. దోమలు వ్యాప్తి చెందకుండా క్రూడాయిల్, కిరోసిన్ చల్లాలని కోరారు. కార్యక్రమంలో జయప్రకాష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలకు ఆర్డీఎస్ నీరు అందించండి



మానవపాడు: పంటలకు ఆర్డీఎస్ నీరు అందించాలని రైతులు అధికారులకు విన్నవించారు. శుక్రవారం సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆర్డీఎస్ అధికారులను మండల రైతులు శేసిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, గోపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, చెన్నిపాడు శాంతన్న, తదితరులు కలిశారు. సాగునీరు లేక మిరపపంటలు ఎండుతున్నాయని వివరించారు. ఆర్డీఎస్ డి.29, డి.30 కాలువులలో నీరులేక మిరప పంటకు మందులు కూడా రైతులు పిచికారీ చేయలేని పరిస్థితి ఉందని తెలిపారు. స్పందించిన అధికారులు రెండు, మూడు రోజులలో నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని, ఇండెంట్ పంపించామని తెలిపారు.

అభ్యసన విధానాలపై అవగాహన

మల్దకల్: మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో అభ్యసన విధానాలపై శుక్రవారం మల్దకల్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఇంక్రిమెంటల్ లెర్నింగ్ అప్రోచ్ గురించి వివరించారు. 11 మాడ్యూల్‌లో బలహీన నవజాత శిశువు సంరక్షణ, 12 మాడ్యూల్‌లో అదనపు ఆహారం, 13 మాడ్యూలో అతి తీవ్ర లోప పోషణను గుర్తించడం, 14 లో అనారోగ్యంతో ఉన్న శిశువులకు ఆహారం ఎలా ఇవ్వాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లకు రోల్‌ప్లే, నాటకీకరణ, ప్రీ టెస్ట్, పోస్టు టెస్టు వంట ప్రశ్న పత్రాల ద్వారా శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, జయప్రదలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బాలమ్మ, వాసంతి, తెల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి సంతతి

అయిజ: కృత్రిమ గర్భదారణతో మేలు జాతి సంతతి కలుగుతుందని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూప రాణి అన్నారు. శుక్రవారం గర్భధారణ పశు వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 24 పశువులను పరిశీలించగా వాటిలో 18 గర్భం దాల్చినట్లు వెల్లడించారు. అదేవిధంగా పశువులకు బ్రుసెల్లాసిస్ వ్యాక్సిన్ ఇచ్చారు. పశు సంవర్ధక శాఖ అధికారుల సూచనమేరకు పశువులకు కృత్రిమ గర్భాధారణ చేయించాలని వైద్యులు సూచించారు. శనివారం మండలంలోని కిష్టాపురం, సోమవారం భంపురంలో పశువులకు గర్భాధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శాంతినగర్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కొంకలలో ఏర్పాటు చేసిన ఉచిత టీకా శిబిరం విజయవంతమైందని డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో ఐదు రోజులుగా నిర్వహించిన శిబిరంలో ఆవు, గేదె దూడలకు బ్రుసెల్లోసిస్ టీకాలు వేశారు.

నిరుపేదలను ఆదుకోండి

అమరచింత: ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో సొంతగా పునాది నిర్మించుకున్న నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా ఒక్కొక్కరికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. ఈ మేరకు సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ చాంద్‌పాషకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా అబ్రహం మాట్లాడుతూ పట్టణంలోని సర్వే నంబర్ 149లో 134 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నివాస స్థలాలు ఇచ్చిందన్నారు.

నూతన మసీదు నిర్మాణ పనులు ఆపాలి

అమరచింత: పట్టణంలో జామీయా మసీదు కమిటీకి సమాచారం ఇవ్వకుండా ముస్లిం మైనార్టీల అభిప్రాయం లేకుండా నూతనంగా నిర్మిస్తున్న మసీదు నిర్మాణ పనులను ఆపాలంటూ మున్సిపల్ ఆర్‌ఐ కృష్ణయ్యకు మసీదు కమిటీ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందించారు. మసీదు నిర్మాణం వల్ల ముస్లింల ఐఖ్యత దెబ్బతింటుందన్నారు. నూతన మసీదు నిర్మాణం చేపట్టకూడదని జామీయా మసీద్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిందని వారు మున్సిపల్ అధికారులకు విన్నవించారు.

ప్రమాదభరితంగా మలుపులు



పెద్దొడ్డి మల్దకల్ గ్రామాల మధ్య ..



కుర్తిరావులచెర్వు మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న మలుపు

మల్దకల్: మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. బీటీ రహదారుల మూల మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయలేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మల్దకల్ నుంచి మద్దెలబండ, అమరవాయి నుంచి బిజ్వారం, పెద్దొడ్డి నుంచి మల్దకల్, కుర్తిరావులచెర్వు నుంచి మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మలుపులు వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

దళితుల ప్లాట్ల ఆక్రమణపై నిరసన

గట్టు: దళితుల ప్లాట్ల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించుకుని, భవనాన్ని నిర్మించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి నిరసనను తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బైనీ తిమ్మయ్య, శారదమ్మ, రామయ్యలకు ఎస్సీ హాస్టల్ పక్కన పట్టాలను ఇచ్చారు. పట్టాలు పొందిన వ్యక్తులు బతుకు దెరువు కోసం వలస వెళితే ప్లాట్లను ఆక్రమించుకుని భవనాన్ని నిర్మించారని ఆరోపించారు.



నిరసన తెలుపుతున్న బాధితులు

అధికారులు విచారణ చేసి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, వెంకోబ్, గురుపాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. ఆశీర్వదించు



అయిజ: పట్టణంలోని లక్ష్మమ్మ, శివురులోని ఈదమ్మ ఆలయాలలో శుక్రవారం భక్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళ వాయిద్యాలతో ఆలయాలను చేరుకొని ఆనవాయితీ ప్రకారం గ్రామ దేవతలకు భక్షాలతో నైవేద్యం సమర్పించారు. కుటుంబ సమేతంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కలశాల ప్రతిష్ఠ



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో ఎనిమిది ఆలయాల గోపురాలకు కలశాల ప్రతిష్ఠాపను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం శివాలయంలో శివ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. కలశాలకు శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో ఆలయాలపై కలశాలను ప్రతిష్ఠించారు. సూర్యనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మాణం చేసి నాగలింగేశ్వర స్వామి, వీరభద్ర స్వామి, భ్రమరాంభికా దేవి, బాల బ్రహ్మేశ్వర స్వామి, వాయు లింగేశ్వర స్వామి, నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో కలశాలను ఏర్పాటు చేసి ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చల్లా గిరిధర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, సర్పంచు నారాయణమ్మ, శివ స్వాములు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయండి



అయిజ: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నరేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ప్రకాష్, వేమన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

అయిజ: పట్టణంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర శివ రామాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా వేద పండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవ, స్వస్తి పారాయణం, ఉత్సవమూర్తుల అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా నవరత్న, రుద్రపూజ, పంచపాలకి నిక్షేపణ భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. కనులపండువగా వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణం జరిగింది. అనంతరం పూర్ణాహుతి, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంకాలం కలశ మహోత్సవం, మంగళ వాయిద్యాలతో వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం నుంచి కాళికాదేవి ఆలయం వరకు గోవిదమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామిల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.



పూజలకు హాజరైన భక్తులు

రాత్రి మహా మంగళహారతి వైభవంగా కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. స్వామివారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ కమిటీవారు భక్తులకు భోజన వసతి కల్పించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

అయిజ: మండలంలోని తిక్క వీరేశ్వర స్వామి జాతర సందర్భంగా శుక్రవారం పట్టణ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. రెండు రోజులపాటు పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి రూ. 15 వేలు, తృతీయ బహుమతి రూ. 10 అందజేస్తామని తెలిపారు.

'డబుల్‌బెడ్రూం ఇళ్లు ఎవరికీ రాలె'



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో డబుల్‌బెడ్రూం ఇళ్లు ఎవరికీ రాలేదని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర 5వ రోజు ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి, తిమ్మాపురం, కొండపేట, యాక్తాపురం గ్రామాలలో కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం బీచుపల్లి ఆంజనేయస్వామిని ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మమేకమై చేయి చేయి కలుపుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ యాత్రను కొనసాగించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతి కుటుంబ పాలన చరమగీతం పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆయన వెంట నాయకులు జోగుల రవి, వెంకటేష్, రాజు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే పర్యటన

రాజోళి: మండలంలోని తూర్పుగార్లపాడు, పడమటి గార్లపాడు, పెద్ద తాండ్రపాడు, తుమ్మిళ్ల గ్రామాల్లో శనివారం హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పర్యటిస్తారని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు తూర్పుగార్లపాడులో యాత్ర ప్రారంభమవుతుందని కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

తెగుళ్లపై రైతులకు అవగాహన



పెబ్బేరు: మండలంలోని బునాదిపూర్‌లో యాసంగిలో పంటలకు వస్తున్న తెగుళ్లపై రైతులకు శుక్రవారం వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాసంగిలో వరి, మినుము పంటలకు తెగుళ్లు అధికంగా వస్తున్నాయని, వాటికి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతోనే మందులు పిచికారీ చేయాలని ఫ్లెక్సీలో చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ ఈ కేవైసీ కొంతమంది రైతుల ఆధార్ కార్డు సీడింగ్ అయిందని, మిగతా రైతులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వనం గోవిందమ్మ, ఏఈఓ నరేష్, రైతులు నరేందర్, రాముడు, బాలస్వామి, రాఘవేంద్ర, గోవిందు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానంపై హర్షం



గట్టులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గద్వాలరూరల్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చుతూ శుక్రవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంపై వినియోగదారుల ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గద్వాల ప్రాంత వాల్మీకి బోయలతో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అబ్రహంలు సీఎం కేసీఆర్‌ని కలిసి ధన్యవాదాలు చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మధుసూదన్‌బాబు, వైండింగ్ రాములు, మురళీ, వెంకటేష్, కోటేష్, నారాయణ, రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మరోసారి ఏకగ్రీవంగా ఆమోదంపై వాల్మీకి మండల అధ్యక్షుడు టీచర్ గోవిందు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం



హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌కు పూలబొకె ఇస్తున్న నాయకులు

చేశారు. కార్యక్రమంలో సిద్దన్‌పల్లి తిమ్మప్ప, నాగేష్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

గట్టు: వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించేందుకు తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదం తెలపడంపై జెడ్పీటీసీ బాసు శ్యామల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వాల్మీకి సంఘం నాయకులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు, సభ్యులు, వాల్మీకులు పాల్గొన్నారు.

రూ.1.20కోట్లతో డివైడర్ పనులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో రూ.1.20 కోట్ల వ్యయంతో డివైడర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పురపాలిక వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం గాంధీ చౌక్ నుంచి అమరచింత రోడ్డు వైపు చేపడుతున్న డివైడర్ పనులను వారు పరిశీలించారు. గాంధీచౌక్ నుంచి బస్టాండ్ రోడ్డు వైపున త్వరలోనే డివైడర్ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, నాయకులు మాసన్న, రియాజ్‌అలీ, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బాలికల రక్షణ అందరి బాధ్యత

కేటీదొడ్డి: బాలికల రక్షణ అందరి బాధ్యత అని శిశు సంక్షేమ శాఖ చైల్డ్‌లైన్ టీం మెంబర్స్ లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురం పాఠశాలలో బాలల హక్కుల చట్టంపై వారు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భగా లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలు, బాలికలపై దౌర్జన్యం, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చట్టాలు ఉన్నాయన్నారు. బాలకార్మికులు ఎదుగుదలతో మార్పులు, వ్యక్తి గత పరిశుభ్రత తదితర అంశాల గురించి వివరించారు. బాలికలకు ఏదైన సమస్య ఎదురైతే 1098 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ జ్యోతికాంత్, సర్పంచు ఆంజనేయులు పాల్గొన్నారు.

పిల్లల వికాసమే దేశాభివృద్ధి

ధరూరు: మండల పరిదిలోని మార్లబీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా బాలల



మాట్లాడుతున్న లక్ష్మీదేవి

పరిరక్షణ విభాగం డీసీపీఓ నరసింహ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిషేధం, బాలల లైంగిక వేధింపులు, బాలల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, ఏఎస్ఐ శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న రథోత్సవం



అల్లపాడు రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ధరూరు: మండలంలోను అల్వాలపాడు గ్రామ శివారులో వెలసిన తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహోత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామివారి రథోత్సవం కనులపండువగా జరిగింది. స్వామివారి రథోత్సవం తిలకించేందుకు జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఆంజనేయ నామస్మరణ మార్మోగింది. అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి సతీమణి సర్పంచు బండ్ల జ్యోతి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేటీఆర్ యువసేన ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్, ఎంపీపీ నజూమున్నీసా బేగం, జెడ్పీటీసీ పద్మ, సర్పంచు వీరన్నగౌడు,అర్చకులు మధ్వాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు విశేష స్పందన



పెద్ద ఆముదాలపాడులో రికార్డులను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



లింగాపురంలోని కంటి వెలుగు శిబిరం పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గట్టు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం గట్టు, లింగాపురం గ్రామాల్లో కంటి వైద్య కేంద్రాలలో పరీక్షలను నిర్వహించారు. రెండు గ్రామాల్లో మొత్తం 273 మంది పరీక్షలు, 36 మందికి రీడింగ్ అద్దాలు, 12 మందికి అద్దాల కోసం ఆర్డర్ పంపినట్లు వైద్యాధికారి తిమ్మప్ప, నరేష్, వెంకటాద్రినాయుడు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వర్ణలత, ఏఎన్‌ఎంలు పార్వతి, తాహీరా, జయమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని పెద్దఆముదాలపాడులో కంటివెలుగును నిర్వహించినట్లు డాక్టర్‌ఆకుబ్‌భాషా తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, సిబ్బంది చంద్రన్న, మాబమ్మ, రాణెమ్మ, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా ఏదీ?



విద్యుత్ అధికారిని ప్రశ్నిస్తున్న సభ్యుడు

మానవపాడు: మండలంలోని మండల ప్రజా పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీపీ అశోక్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను సభ్యులు లేవనెత్తారు. 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయకపోవడంపై ఉపాధ్యక్షుడు సోమన్నగౌడ్, ఉండవెల్లి మండల పీఏసీఎస్ అధ్యక్షుడు గజేంద్రగౌడ్ అధికారులను నిలదీశారు. స్పందించిన అధికారులు రైతులకు విడతులగా 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. ఆర్డీఎస్ నీరు అందడం లేదని ప్రశ్నించగా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని మూడు రోజులలో నీరు విడదల చేస్తామని వివరించారు. మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా పెండింగ్ పనులను సైతం త్వరగా పూర్తి చేస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. ఇదిలా ఉండగా సర్వసభ్య సమావేశంలో సభ్యులకు, ఎంపీపీ మధ్య గందరగోళం వాతావరణం ఏర్పడుతుందని అందరు భావించినా ఎటువంటి సంఘటన చోటుచేసుకోలేదు. దీని వెనుక రాజకీయ ఆంతర్యం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, సర్పంచ్ సంఘం మండల అధ్యక్షుడు ఆత్మలింగారెడ్డి, ఎంపీటీసీ రోషన్న, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రింగులకు డిమాండ్



కొండేరు స్టేజీ వద్ద విక్రయానికి సిద్ధంగా రింగులు

ఎర్రవల్లిచౌరస్తా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిస్తున్నాయి. గ్రామాలలో పరిశుభ్రతకు అన్ని చర్యలు తీసుకొంటోంది. భూగర్భజలాలు పెంచేవిధంగా ఇంకుడు గుంతలు, మహిళల ఆత్మగౌరవం కాపాడేవిధంగా మరుగుదొడ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. దీంతో సిమెంట్ ఇటుకలు, రింగులకు భలే గిరాకీ పెరిగింది. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు సమయంతోపాటు డబ్బులు కూడా ఆదా కావడంతో అందరూ సిమెంట్ ఇటుకలతోనే నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇటిక్యాల మండలంలో పలు ప్రాంతాల్లో గృహ నిర్మాణాలకు కూడా వీటినే వినియోగిస్తున్నారు. గతంలో మరుగుదొడ్ల నిర్మాణానికి గుంతలు తీసి చెక్కరాయితో గోడలను నిర్మించేవారు. కాని ప్రస్తుతం సిమెంట్ ఇటుకలను, రింగులనే అధికంగా ఉపయోగిస్తున్నారు. ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డితో పాటు, ఇంకుడు గుంతలు ఉండాలనే లక్ష్యంతో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలను విరివిగా చేపట్టింది. ప్రస్తుతం మార్కెట్‌లో సిమెంట్ ఇటుక ధర రూ. 18 నుంచి రూ. 20 వరకు పలుకుతుండగా, రింగుల ధర రూ. 300 నుంచి రూ. 400 వరకు విక్రయిస్తున్నారు.

మండలంలో తయారీ కేంద్రాలు

ఇటిక్యాల మండలంలో ఎర్రవల్లిచౌరస్తా, కొండేరు, జింకలపల్లి, ఎర్రవల్లి తదితర గ్రామాలలో సిమెంట్ ఇటుకలు, రింగుల తయారీ కేంద్రాలున్నాయి. చెక్కరాయితో గుంతలను ఏర్పాటు చేయడానికి రూ. 10000 నుంచి రూ. 13000 వరకు ఖర్చు అవుతుంది. కానీ సిమెంట్ రింగులతో గుంతలను ఏర్పాటు చేయడానికి రూ. 6000 నుంచి రూ. 8000 లోపు మాత్రమే ఖర్చు అవుతుంది. సమయం, ఖర్చు ఆదా కావడంతో లబ్ధిదారులు వీటిపై అధికంగా దృష్టి సారిస్తున్నారు. సామాన్యులకు కూడా ధరలు అందుబాటులో ఉండటంతో లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు. తయారీ కేంద్రాల వల్ల సంవత్సరం పొడవునా కూలీ పని దొరకడంతో పాటు తయారీదారులకు జీవనోపాధి దొరుకుతుందని తయారీదారులు, కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యజమానులకు ఖర్చు తక్కువ



సిమెంట్ ఇటుకలతో నిర్మాణాలు చాలా సులభమవుతుంది. పనులు కూడా చాలా వరకు వేగవంతం అవుతాయి. యజమానులకు ఖర్చు తగ్గుతోంది. ప్రస్తుతం చాలా మంది సిమెంట్ ఇటుకలను కొనుగోలు చేస్తున్నారు. సమయం, ఖర్చు ఆదా కావడంతో వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు.

– నర్సింహులు, తయారీదారుడు, ఎర్రవల్లి

జీవనోపాధి పొందుతున్నాం



ప్రస్తుతం గ్రామాలలో ఇండ్ల, మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. అందులో సిమెంట్ ఇటుకలు, రింగులనే వినియోగదారులు అధికంగా వాడుతున్నారు. తయారీ కేంద్రాలలో కూలీలకు ఏడాదిపొడవునా పని దొరుకుతుంది. అలాగే చాలా కుటుంబాలు కూడా వాటిపైనే ఆధారపడి జీవనోపాధి పొందుతున్నాయి.

– సాయిబాబ, కూలీ, కొండేరు